



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
జనవరి 30, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# మహా విషాదం

**కుంభమేళాలో తొక్కిసలాట..**

**30 మంది మృతి, 60 మందికి గాయాలు**

- మంగళవారం అర్ధరాత్రి దాటాక దుర్ఘటన
- మధ్యాహ్నం దాకా స్నానాల నిలిపివేత.. ఆ తర్వాత కొనసాగింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ
- నిర్వహణ సరిగా లేదంటూ విపక్షాల విసుర్లు

2లో

తెల్లవారుజామున మూడు గంటల సమయం.. బ్రహ్మ ముహూర్తంలో పుణ్యస్నానాలు చేసేందుకు 'సంగమ్ నోస్' ఘాట్ వద్ద వేచిచూస్తున్న లక్షలాది మంది భక్తులు.. ఒక్కసారిగా బారికేడ్లకు అటువైపు పెరిగిన భక్తుల రద్దీ.. వారంతా పక్కన కూర్చున్న వారిపై పడటంతో అంతా హాహాకారాలు.. ఏం జరిగిందో తెలియని పరిస్థితి.. పోలీసులు కిందపడినపోయిన 90 మందిని తాత్కాలిక సెంట్రల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో 30 మంది ప్రాణాలు వదిలారు. 60 మంది గాయపడ్డారు. అత్యంత పవిత్రమైన మౌని అమావాస్య రోజు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిద్దామని మహాకుంభమేళాకు వచ్చిన కొందరు భక్తులు అనూహ్యంగా జరిగిన తొక్కిసలాటకు బలవటం విషాదాన్ని మిగిల్చింది. స్నానఘట్టాల్లో భక్తకోటి శరణుఘోషకు బదులు మృత్యుఘోష వినిపించింది.



# 10లోగా పర్యాటక పాలసీ

- బహుళజాతి కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా రూపొందించండి
- టూరిజం శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో విధానాలపై అధ్యయనం చేయండి
- కవ్వాల్, అమ్రాబాద్‌లలో సఫారీ టూరిజం..
- మేడారం-రామప్ప-లక్నవరం సర్క్యూట్.. సాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్‌లు
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డు సత్వరం ఏర్పాటు చేయాలని ఆదేశం

హైదరాబాద్: రాష్ట్రానికి సంబంధించి సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి పదో తేదీలోగా సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాలను ప్రాతిపదికగా చేసుకొని పాలసీని రూపొందించాలని సూచించారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం ఈ అంశంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న పర్యాటక పాలసీలపై అధ్యయనం చేసి, అనుసరించదగ్గ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రానికి దేశీ, విదేశీ పర్యాటకులు వచ్చేలా చూడాలన్నారు. పర్యాటక రంగంలో బహుళ జాతి కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీ ఉండాలని, దీనితో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు ఏర్పడి, పర్యాటకులను ఆకట్టుకోవటానికి వీలవుతుందని స్పష్టం చేశారు.

**పర్యాటక ఆదాయం పెరగాలి**

కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనువుగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం

(మిగతా 2వ పేజీలో)

# 2న 'సమగ్ర సర్వే' నివేదిక

- మంత్రివర్గ ఉప సంఘానికి అందజేస్తామన్న అధికారులు
- ఈ అంశంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్
- రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతమైందని వెల్లడి
- ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శమని వ్యాఖ్య
- అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి అభినందన



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను అధికారులు వచ్చే నెల 2న మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించనున్నారు. దానికన్నా రెండు రోజులు ముందే నివేదిక ముసాయిదాను సిద్ధం చేసి అందించనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో వెల్లడించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ సర్వే రాష్ట్రంలో సామాజిక సాధికారతతోపాటు భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల సర్వే చేపట్టి చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని.. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం పట్ల ప్రశంసలు అందుతున్నాయని పేర్కొన్నారు.



**అసర్ నివేదికతో విద్యావ్యవస్థలో విధ్వంసం బయటపడింది: మంత్రి నారా లోకేశ్**

- దేశంలోని విద్యా ప్రమాణాలపై అసర్ నివేదిక
- 2022-24 మధ్య ఏపీలో విద్యా ప్రమాణాలు దిగజారాయన్న అసర్
- జగన్ పై మంత్రి నారా లోకేశ్ విమర్శనాస్త్రాలు

# రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

**రేషన్ కార్డులపై,**
**రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్**



హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో విషయమై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణలో రేషన్ కార్డులపై, రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేస్తూ తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. దీంతో, మరోసారి రాజకీయం ఆసక్తికరంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా లేఖలో?..'తెలంగాణలో రేషన్‌కార్డులపై, రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం పేరును కొనసాగించాలని కోరారు. ఇదే సమయంలో రాష్ట్రంలో

(మిగతా 2వ పేజీలో)



**ఘనంగా లక్ష్మీ అయుక్త**
**2వ జన్మదిన వేడుకలు**

# మహా విషాదం



మహాకుంభ్ నగర్: అత్యంత పవిత్రమైన మౌని అమావాస్య రోజు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిద్దామని మహాకుంభమేళాకు వచ్చిన కొందరు భక్తులు అనూహ్యంగా జరిగిన తొక్కిసలాట(%ఝఎ-జూవసవ%)కు బలయ్యారు. గత కొద్దిరోజులుగా అశేష జనవాహినితో జనసంద్రమైన ప్రయాగ్‌రాజ్(%భాత్ఝుఝ్రత్ఝయి%) మహాకుంభమేళా(%మీఝష్ఝు ఖబఎఎష్ట వీవశ్రీఝ%) స్నానఘట్టంతో భక్తకోటి శరణఘోషకు బదులు మరణమృదంగం వినిపించింది. మంగళవారం అర్ధరాత్రిదాటాక 1%-%2 గంటల ప్రాంతంలో త్రివేణి సంగమ స్థలి సమీపంలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 60 మంది గాయపడ్డారు. దీంతో కొద్దిసేపు పుణ్యస్నానాల క్రతువును మధ్యాహ్నందాకా ఆపేశారు. మృతుల్లో కర్ణాటక, అస్సాం, గుజరాత్ నుంచి వచ్చిన భక్తులున్నారు. మౌని అమావాస్య రోజు ఒక్కరోజే 10 కోట్లమంది భక్తులు రావొచ్చన్న ముందస్తు అంచనాతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అత్యంత పటిష్ట ఏర్పాట్లుచేసినా అపశృతి చోటుచేసుకోవడంతో అక్కడ అంతా విషాదం అలుముకుంది. 30 మంది మృతుల్లో 25 మందిని గుర్తించారు. వారిలో నలుగురు కర్ణాటక వాసులున్నారు. అస్సాం, గుజరాత్ నుంచి చెరో భక్తుడిని గుర్తించారు. గాయపడిన వారిలో 36 మందికి ఇంకా చికిత్స కొనసాగుతోంది. మిగతా వారిని డిశ్చార్జ్‌చేశారు.

### అంతా గందరగోళం, హాహాకారాలు

తెల్లవారుజామున మూడుగంటలకు బ్రహ్మ ముహూర్తంలో స్నానాలు చేయడానికి లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమ స్థలిలోని సంగమ్ నోస్ ఘాట్ వద్ద కూర్చుని వేచి చూస్తుండగా ఒంటిగంట దాటాక బ్యారీకేడ్లకు అటువైపుగా ఉన్న భక్తులు కిటకిట ఎక్కువ కావడంతో ఇటువైపు దూకారు. ఎక్కివస్తున్న, నెడుతున్న జనం ధాటికి బ్యారీకేడ్లు విరిగిపోయాయి. దీంతో కూర్చున్న వారిపై అటువైపు నిల్చున్న భక్తులు పడ్డారు. వారిపై పక్కనున్న వాళ్లు పడటంతో కిందనున్న వాళ్లు ఊపిరాడక చనిపోయారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంచేసినా కోట్లాది జనం కావడంతో అది వెంటనే సాధ్యపడలేదు. కిందపడిన దాదాపు 90 మంది భక్తులను పోలీసులు ఆ జనం మధ్యే భుజాలపై ఎత్తుకుని, అంబులెన్సుల్లోకి ఎక్కించి మేళా ప్రాంగణంలోనే ఏర్పాటుచేసిన తాత్కాలిక సెంట్రల్ ఆస్పత్రికి తరలించారు. అయినాసరే వారిలో 30 మంది చనిపోయారని మహాకుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ ప్రకటించారు. తొక్కిసలాట కారణంగా వెంటనే పుణ్నస్నానాలను పోలీసులు, సహాయక సిబ్బంది ఆపేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని నిర్ధారించుకున్నాక మధ్యాహ్నం రెండున్నర గంటలకు 13 అఖాడాల అమృత్ స్నాన్‌తోపాటు భక్తుల పుణ్యస్నానాలకు అనుమతి ఇచ్చారు.

### జనం మధ్య చిక్కుకున్న అంబులెన్సులు

భయంతో భక్తులు చిందరవందరగా పరుగెత్తడంతో బ్యాగులను వెంటేసుకొచ్చిన కొందరు వాటిని అక్కడే పడేశారు. అవి తగిలి ఇంకొందరు పడ్డారు. చెత్త కోసం ఏర్పాటుచేసిన ఇనుప చెత్త డబ్బాలు తగిలి చాలా మంది పడ్డారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. తొక్కిసలాటలో కిందపడి స్పృహకోల్పోయిన భక్తులను వెంటనే అంబులెన్సుల్లో ఎక్కించినా జనం మధ్యలో ముందుకు కదల్లేక అవి చాలాసేపు అక్కడే ఆగిపోయాయి. పోలీసులు రంగంలోకి దిగి ఎట్టకేలకు వాటికి దారి కల్పించారు. వీఐపీల కోసం కొంత మేర స్థలాన్ని వదిలేయడంతో పక్కన రద్దీ పెరుగుతోంది. ఇకపై వీఐపీ ప్రోటోకాల్ పేరిట జనాన్ని పక్కకు నెట్టేసే విధానాన్ని పాటించబోమని అక్కడి అధికారి ఒకరు చెప్పారు. సాధారణ భక్తులు, అఖాడాల కోసం వేర్వేరుగా ఏర్పాటుచేసిన వరసలు, బ్యారీకేడ్ల వద్ద ఘటన జరిగిందని అధికారి పేర్కొన్నారు. కుప్పలుగా భక్తుల దుస్తులు, దుప్పట్లు, బ్యాగులు, చెప్పులు పడి తొక్కిసలాట ప్రాంతం చిందరవందరగా తయారైంది. స్పృహ కోల్పోయిన తమ వారిని తట్టిలేపేందుకు ప్రయత్నిస్తున్న కుటుంబ సభ్యులతో ఆప్రాంతంలో ఒక్కసారిగా నిర్వేదం నెలకొంది. " కర్ణాటక నుంచి మేం 60 మంది బృందంగా వచ్చాం. అన్ని వైపుల నుంచి తోశారు. తప్పించుకునే ఆస్కారం లేకుండాపోయింది" అని కర్ణాటక నుంచి వచ్చిన సరోజిని అనే భక్తురాలు ఏడుస్తూ చెప్పారు. " బ్రహ్మముహూర్తంలో స్నానం చేద్దామని కూర్చుని, పడుకుని వేచిచూస్తున్న వారిపైకి వెనక నుంచి ఒక్కసారిగా జనం మీదపడ్డారు. దాంతో తొక్కిసలాట జరిగింది" అని అస్సాం నుంచి వచ్చిన బాదామా దేవి చెప్పారు. ఇలా జరగాలని గంగమ్మ తలచిందేమో అని జార?ండ్‌లోని పలాము నుంచి వచ్చిన రామ్ సుమిరాన్ అనే భక్తుడు అన్నాడు. తొక్కిసలాటకు ముందే ఏదైనా ఉపద్రవం జరగొచ్చని ఊహించిన ప్రయాగ్‌రాజ్ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ మాట్లాడుతున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఘాట్ వద్ద కూర్చుని వేచిచూస్తున్న భక్తులకు ఆయన " లేవండి. లేవండి. త్వరగా స్నానంచేసి వెళ్లపొండి. వెనక నుంచి ఊహించనంత మంది జనం వచ్చేస్తున్నారు" అని ఆయన అక్కడి భక్తులకు ముందే హెచ్చరిస్తుండటం ఆ వీడియోలో ఉంది. " భక్తుల్లో పోకిరీలూ ఉన్నారు. చిన్నారులు ఉన్నారన్న ఇంగితజ్ఞానం లేకుండా నవ్వుతూ మమ్మల్ని తోసేశారు. తొక్కిసలాటలో మా పిల్లలు గాయపడ్డారు" అని ఆస్పత్రిలో ఉన్న ఒక మహిళ తెలిపింది. ు

### విచారం వ్యక్తం చేసిన ప్రముఖులు

ఘటన జరిగిన విషయం తెల్సి వెంటనే ప్రధాని మోదీ సీఎం యోగికి ఉదయం, మధ్యాహ్నం నాలుగైదు సార్లు ఫోన్‌చేసి తాజా పరిస్థితిపై వాకబు చేశారు. భక్తుల మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. " మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి" అని మోదీ అన్నారు. రాష్ట్రపతి ముర్ము సైతం దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బుధవారం ఒక్కరోజే 7.5 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసినట్లు ప్రాథమిక సమాచారం. ప్రయాగ్‌రాజ్‌లో బుధవారమే దాదాపు 10 కోట్ల మంది జనం వచ్చేశారని వారు బయటికెళ్లేదాకా కొత్తవారిని అనుమతించొద్దని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. సంగమ్ నోస్ ఘాట్ వైపు వెళ్లొద్దని భక్తులకు యోగి విజ్ఞప్తిచేశారు. ప్రయాగ్‌రాజ్‌కు దారితీసే మార్గాలను మూసేసినట్లు తెలుస్తోంది. వెనక్కి వచ్చే భక్తుల కోసం రైల్వేశాఖ అదనపు రైళ్లను నడపనుంది.

### ముగ్గురు సభ్యులతో జుడీషియల్ కమిషన్

ఘటనకు కారణాలను తెల్సుకునేందుకు జస్టిస్ హార్ష్ కుమార్, మాజీ డీజీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ వీకే సింగ్‌లతో యోగి ప్రభుత్వం ఒక జుడీషయల్ కమిషన్‌ను నియమించింది. మృతుల కుటుంబాలకు సీఎం యోగి తలో రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ స్వయంగా ఘటనాస్థలికి వచ్చి సమీక్ష జరపనున్నారు.

### దుమ్మెత్తి పోసిన విపక్షాలు

నిర్వహణ లోపాలు, వీఐపీల స్నానాల మీదే అధికారుల ధ్యాస, ఘనంగా నిర్వహిస్తున్నామని అతి ప్రచార ఆర్భాటాలతో తొక్కిసలాట జరిగిందని విపక్షాలు యోగి, మోదీ ప్రభుత్వాలపై దుమ్మెత్తిపోశాయి. " వీఐపీ సంస్కృతి వదిలేయండి. సాధారణ భక్తులను పట్టించుకోండి. ప్రచారంపై దృష్టిపెట్టి పటిష్ట భద్రతను గాలికొదిలేయడం వల్లే తొక్కిసలాట జరిగింది" అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్పీ, టీఎంసీ, శివసేన(యూబీటీ), బీఎస్పీ పార్టీలు యోగి, మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించాయి.

# అసర్ నివేదికతో విద్యావ్యవస్థలో విధ్వంసం బయటపడింది: మంత్రి నారా లోకేశ్

### 2022-24 మధ్య ఏపీలో విద్యా ప్రమాణాలు దిగజారాయన్న అసర్ జగన్ పై మంత్రి నారా లోకేశ్ విమర్శనాస్త్రాలు



దేశంలోని విద్యా ప్రమాణాలపై యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (%ూూజు=%-అసర్) వెలువడడం తెలిసిందే. 2022-24 మధ్య కాలంలో ఏపీలో విద్యా ప్రమాణాలు దిగజారాయని అసర్ స్పష్టం చేసింది. దీనిపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో జగన్ రెడ్డి గారి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం బయటపడిందని తెలిపారు. ఆయన ప్రచారానికి మేనమామ, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైందని ఎద్దేవా చేశారు. పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని తేటతెల్లం అయ్యిందని లోకేశ్ విమర్శించారు. 2018లో నాటి టీడీపీ హయాంలో మెరుగ్గా ఉన్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదికలో స్పష్టంగా వెల్లడించింది. అడ్డగోలు జీవోలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు, తగ్గిన హాజరు శాతం, తాగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం... ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేని పరిస్థితి నెలకొంది. విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు గత ఏడు నెలలుగా అనేక చర్యలు తీసుకున్నాను. నిరంతరం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు తెలుసుకుంటూ అనేక మార్పులకు నాంది పలికాను. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు అని పక్కా లెక్కలు తీయడం దగ్గర మొదలుపెట్టి... మారుతున్న కాలానికి తగ్గట్టుగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేయడం, విలువలతో కూడిన విద్య, విద్యార్థులను క్రీడలతో సహా ఇతర రంగాల్లో ప్రోత్సహించే గైడెన్స్ ఇవ్వడం, కనీస మౌలికవసతులు కల్పించడం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం వరకూ అనేక అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందించి ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోబోతున్నాం" అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

# 10లోగా పర్యాటక పాలసీ

ఆదేశించారు. "మేడారం, రామప్ప దేవాలయం, లక్నవరాలను సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో కేరళ తరహాలో బోట్‌హౌస్‌లతో పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూడాలి. రాష్ట్రంలోని బౌద్ధ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలి. సమ్మక్క%-%సారలమ్మ జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలి.."అని సూచించారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ స్కైవాక్, సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలన్నారు. అనంతగిరితోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగుపర్చాలని చెప్పారు. పరిశ్రమలు, ఇతర రంగాల నుంచి వచ్చే ఆదాయమే కాకుండా పర్యాటక రంగం నుంచీ ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డును సత్వరం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని దేవాదాయశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సూచించారు. యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితోపాటు ఆలయం తరఫున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.

# రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

అర్హులకు రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జనవరి 26 నుంచి అమలు చేసిన నాలుగు పథకాలు.. రాష్ట్రంలో మూడు శాతం మందికి కూడా చేరలేదని తెలిపారు. అలాగే, 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పిన రైతు భరోసా ఎక్కడ? అని ప్రశ్నించారు. 10లక్షల మంది రైతు కూలీల కుటుంబాలకు ఇస్తామని చెప్పిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎప్పుడు



ఇస్తారు?. కొత్తగా ఇస్తామని చెప్పిన 40 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయారని లేఖలో పేర్కొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి కి కేంద్రమంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ

ఇదిలా ఉండగా.. అంతకుముందు ఇందిరమ్మ ఇళ్లపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేసే ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడతామంటే ఒక్క పైసా కూడా కేంద్రం నుంచి ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. మోదీ సర్కారు మంజూరు చేసే ఇళ్లకు ఇందిరమ్మ పేరు ఎలా పెడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫోటో కచ్చితంగా పెట్టాలని, లేదంటే రాష్ట్రానికి ఉచిత బియ్యం సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. అవసరమైతే కేంద్రమే పేదలకు ఉచిత బియ్యం పంపిణీపై ఆలోచిస్తుందన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాల బాటలో నడుస్తోందని ఆరోపించారు. ఫాంహౌస్, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, డ్రగ్స్ కేసులన్నీ మరుగునపడ్డాయని విమర్శించారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో కేటీఆర్ అరెస్టుకు అన్ని ఆధారాలున్నాయని సీఎం చెప్పిన తర్వాత కూడా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. దీంతో, తెలంగాణలో మరోసారి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది.

# ఆప్‌ను ప్రజలు క్షమించరు

### యమున నదిలో విషం కలుపుతూ ఉన్నారని అనడం దారుణం: మోదీ

### తనతోపాటు దౌత్యవేత్తలు, జడ్జీలు ఈ నీటిని తాగుతున్నారని వెల్లడి



న్యూఢిల్లీ: యమున నదిలో విషం కలుపుతున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తేలడంతో ఆప్ నాయకులు మతితప్పి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని కర్తార్ నగర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆప్ నాయకులకు, చార్లెస్ శోభారాజ్‌కు మధ్య పెద్ద తేడా లేదని అన్నారు. పైకి అమాయకంగా కనిపిస్తూ ప్రజల సొమ్మును దోచుకోవడంలో వారు ఆరితేరిపోయారని దుయ్యబట్టారు. "వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టినవారు, అద్దాల మేడల్లో నివసిస్తున్నవారు పేదల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. ఓటమి భయంతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీలో యుమున నదిని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడు దగాకోరు మాటలు చెబుతోంది. యమునా నదిని శుభ్రం చేస్తామని హామీ ఇస్తే ఓట్లు రావని అంటోంది. ఇది నిజంగా సిగ్గుచేటు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు దొరకడం ఆమ్ ఆద్మీ పార్టీకి ఇష్టంలేదు. ఢిల్లీలోని పూర్వాంచల్ ప్రజలు మురికికూపంలోనే ఛాత్ పూజలు చేసుకోవాలని కోరుకుంటోంది. ఆమ్ ఆద్మీ పార్టీ దేశ చరిత్రలో అతిపెద్ద పాపం చేసింది. ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. మాజీ ముఖ్యమంత్రి(అరవింద్ కేజ్రీవాల్) హరియాణా ప్రజలపై నిందలు వేశారు. యమునా నదిలో విషం కలిపారని అన్నారు. హరియాణాలో ఉన్నది మనుషులు కాదా? వారికి ఢిల్లీలో కుటుంబ సభ్యులు, బంధువులు లేరా? సొంత మనుషులు చావాలని నదిలో విషం కలుపుతారా? యమున నదిలో హరియాణా నుంచి వస్తున్న నీటినే నాతోపాటు ఢిల్లీ ప్రజలు, దౌత్యవేత్తలు, న్యాయమూర్తులు కూడా తాగుతున్నారు. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం నదిలో విషం కలిపి నాకు హాని కలిగిస్తుందని ఎవరైనా అనుకుంటారా? ఆప్ నాయకులు అసలేం మాట్లాడుతున్నారు? తప్పులను క్షమించే గుణం మన భారతీయుల్లో ఉంది. కానీ, ఉద్దేశపూర్వకంగా పాపాలు చేస్తే ఎవరూ క్షమించరు. ఆప్ పాపాత్ములను మన్నించే ప్రసక్తే లేదు"అని మోదీ అన్నారు.

# సైనిక్‌పూరిలో త్రిబుల్ ఆర్ సెంటర్ ప్రారంభించిన డిసి

కాప్రా,వార్త మిర్రర్,జనవరి 29:కాప్రా సర్కిల్ పరిధిలోని సైనిక్ పూరి చౌరస్తా లోకల్ షాపింగ్ కాంప్లెక్స్ జిహెచ్ఎంసి స్వచ్ఛ భారత్,స్వచ్ఛ సర్వేక్షన్ 2025 లో భాగంగా నిరుపయోగమైన వస్తువులను అవసరం ఉన్నవారు ఉపయోగించు కోవడానికి త్రిబుల్ ఆర్ సెంటర్ ను కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల కాలనీల సంబంధించిన వారు అందించిన వివిధ రకాల ట్రిపుల్ ఆర్ కు సంబంధించిన వస్తువులను సెంటర్లో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ విభాగము నుంచి డాక్టర్ శంకర్, జై యశశ్రీ,నరేష్ పాల్గొన్నారు.కార్యక్రమంలో డిసి జగన్ చేతుల మీదుగా వినయ్ కుమార్ కు జర్కిన్,హెల్త్ అండ్ శానిటేషన్ విభాగము మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, సూపర్వైజర్ సుదర్శన్,రామకృష్ణ,శ్రీనివాస్,కృష్ణ ,ఎస్ ఎఫ్ ఏ లు వసంత,మంజుల,సుజాత కే.లక్ష్మి,శిరీష,అశ్విని ప్రసాద్, భాగ్యలక్ష్మి,ఇంచార్జ్ ఎస్ ఎఫ్ ఏ.అంజలి పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జగన్ మాట్లాడుతూ సర్కిల్లో ఏ కాలనీ వారైనా కూడా తమ వద్ద నిరుపయోగమైన వస్తువులను సైనిక్పురి షాపింగ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్ కు అందజేయవలసినదిగా సూచించారు.ఎవరికైనా ఇక్కడున్న వస్తువులు అవసరం ఉన్నవారు తీసుకోవచ్చని అన్నారు.



జిహెచ్ఎంసి స్వచ్ భారత్ మిషన్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ట్రిపులర్ సెంటర్ యొక్క విశిష్టత, ఉపయోగాన్ని తెలియజేస్తూ ఇంకా రెగ్యులర్ సెంటర్ల యొక్క అవసరం చాలా ఉందని అన్నారు. సైనిక్పురి సెంటర్ ఏర్పాటు చేసినందుకు కాప్రా సర్కిల్ బీసీని,సానిటేషన్ అధికారులను,సిబ్బందిని అభినందించారు.

# ఘనంగా మన్నె సుబ్రహ్మణ్యం 56వ జయంతి



కాప్రా,వార్త మిర్రర్,జనవరి 29:ప్రముఖ పారిశ్రామికవేత్త, కీర్తిశేషులు మన్నె సుబ్రమణ్యం 56వ జయంతి కార్యక్రమాన్ని కుషాయిగూడ లో ఘనంగా నిర్వహించారు.మన్నె సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుషాయిగూడ పారిశ్రామిక వాడలో మన్నె సుబ్రమణ్యం చారిటబుల్ ట్రస్టు, మిత్ర మండలి ఆధ్వర్యంలో రక్తదానం,అన్నదానం ఏర్పాటు చేశారు.సుమారు ఐదు వందల మంది రక్తదానం చేశారు.ఐదు వేల మందికి అన్నదానం చేశారు.ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చిన మన్నె సుబ్రమణ్యం ఆ విషయం మర్చిపోకుండా అట్టడుగున ఉన్న ఎందరో పేద ప్రజలకు ఆర్థిక సహాయం చేసి,విద్య,వైద్యం,విదేశాల్లో చదువులు అన్ని రకాలుగా ఆదుకున్నారని సముద్రాల వేణుగోపాలచారి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కొత్త రామారావు తెలిపారు.నేటి నుంచి మన్నె సుబ్రమణ్యం చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని మన్నె సుబ్రమణ్యం కుమారుడు నాగ ఫణీంద్ర అన్నారు. అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో పరిశ్రమలు స్థాపించి ఎందరికో సహాయం చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని ఆయన పేరు,ఆయన ఆశయాలను నిలబెడుతూ మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మన్నె సుబ్రమణ్యం మిత్ర మండలి తరపున కొత్త రామారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు,స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం

## గెలుపోటములు సహజం..సందీప్ కుమార్

కల్వకుర్తి ఊర్కొండ వార్త మిర్రర్ ప్రతినిధి:-నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలో గత మూడు రోజులుగా ఊర్కొండ ప్రీమియం లీగ్-4 నిర్వహించడం జరిగింది, ఈ టోర్నమెంట్ లో విజయం సాధించిన జట్టులకు నవభారతి డిఫెన్స్ కి కంఠం శ్రీశైలం రూ" 15,116 రూపాయలు బండి వారియర్స్ సందీప్ కుమార్(మున్న) రూ " 7,116 రూపాయలతో పాటు షీల్డ్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో ఊర్కొండ మండలంలో ప్రతి గ్రామంలో క్రీడాకారులను మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికి తీయడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. క్రీడలకు మరియు సహకరించిన నిర్వాహకులకు, గెలుపొందిన క్రీడాకారులకు గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవ భారతి డిఫెన్స్ జట్టు,బండి వారియర్స్ జట్టు,వివిఎస్ఆర్ జట్టు,ఎవి జట్టు,ఒనర్స్ మరియు క్రీడాకరులు మరియు గ్రామ పెద్దలు జిల్లా మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# గౌరవ డాక్టరేట్ అందుకున్న పి.ఆర్. శ్రీనివాసన్

సికింద్రాబాద్,వార్త మిర్రర్ జనవరి 29.... ప్రముఖ ఎంటర్ప్యూనర్ పి.ఆర్. శ్రీనివాసన్ ఇటీవల యునైటెడ్ థియాలోజీకల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవాలను పురష్కరించుకుని వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని గుర్తించి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేసింది. ఇందులో భాగంగానే ఎంటర్ప్యూనర్షిప్, సృజనాత్మక రంగంలో సమాజ పురోభివృద్ధిని నడిపించే ఆవిష్కరణలు, సహకారం, అవకాశాలను సృష్టించడంపై శ్రీనివాసన్ చేస్తున్న విశేషమైన కృషిని, సేవలను గుర్తించి ఈయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. విశ్రాంత జడ్జి మధుసూదన్ రావు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. దీపక్ ఫ్రాన్సిస్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ ఈ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ ను అందజేసిన థియాలొజికల్ యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## హాస్టల్‌లో ఆకస్మిత తనిఖీ చేసిన పుర కమిషనర్ మహమ్మద్ షేక్

కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మున్సిపల్ పట్టణ పరిధిలో ఉన్న మైనారిటీ బాలికల కాలేజ్ నందు బుధవారం పుర కమిషనర్ మహ్మద్ షేక్ సందర్శించడం జరిగింది. మైనార్టీ హాస్టల్ నందు విద్యార్థులకు ఉన్న వసతులు, ఆహార వస్తువుల నిలువ, చేస్తున్న విధానం తెలుసుకోవడం మరియు హాస్టల్ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ పై పలు సూచనలు చేస్తూ మరియు విద్యార్థులకు



ప్రతిరోజు అందిస్తున్న భోజనం ఏ విధంగా ఉంది అని పరిశీలించడం జరిగినది. అదేవిధంగా విద్యార్థులతో కలిసి పుర కమిషనర్ భోజనం విద్యార్థులతో కలిసి చేశారు.. ప్రతి రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మరియు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపల్ కు సూచించడం మరియు విద్యార్థుల తో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ శివ పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వేల్జాల్‌లో ఘనంగా ఊర్సు ఉత్సవాలు

ఆమనగల్ ప్రతినిధి శివ వార్త మిర్రర్ : వేల్జాల్ గ్రామంలో ఈ రోజు 35వ ఉర్సు ఉత్సవాలు ముస్లిం మత పెద్దలు దర్గా ముతవల్లి,అబ్దుల్ నయుమ్ అధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అబ్దుల్ కలీమ్,అబ్దుల్ రహీమ్‌లతో పాటు ఊర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తలకొండపల్లి మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్ మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ముజుబూర్ రెహమాన్ హాజరై ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు.అనంతరం ముస్లిం మత పెద్దలు మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్‌ను ముజుబూర్ రెహమాన్‌ను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వహీద్ అల్లీ,ఫవదుర్ రహమాన్, ఫరుఖీ,ఖాజాబునోద్దీన్ తదితరులు ఉన్నారు.

## విప్లవ భావజాలానికి కొమ్ముకాస్తూ ఏబీవీపీ బిజెపి నాయకుల హత్యలకు కారకుడు గద్దర్

## బీజేవైఎం అధికార ప్రతినిధి-ఎలిజాల శ్రీను



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : భారతీయ జనతా పార్టీ ఎప్పుడైనా ప్రజాస్వామ్య బాటలో నడుస్తుంది.ఇటీవల పద్మశ్రీ అవార్డుల జాబితాలో గద్దర్ పేరు లేకపోవడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీని తప్పుపడుతూ విప్లవ భావజాలాలు కలిగిన వ్యక్తులని భారతీయ జనతా పార్టీ మీదికి ఉసిగొల్పే పనిలో భాగం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గద్దర్ తెలంగాణ ఉద్యమ కారుడు, కళాకారుడు, గద్దర్ కలంతో ఉద్యమాన్ని ఉధ్రుతలూగించిన వ్యక్తి,కానీ తన ఆటా పాట తో విప్లవ భావాల తో యువకులను నక్సలిజం వైపు వెళ్లేలా చేశారు.తను విప్లవ భావజాలనికి కొమ్ముకాస్తూ అమాయకులైన ఏబీవీపీ, బిజెపి జాతీయభావాలు కలిగిన యువకులను హతమార్చుటకు మద్దతు పలికాడు.ఆనాటి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుండగొని మైసయ్య గౌడ్ ను తెరట్పల్లి గ్రామంలో , మంచాల మండలం తాళ్ళగూడెం గ్రామానికి చెందిన మహేందర్ గౌడ్ ను కాల్చి చంపారు.అనేక మంది బీజేపీ నాయకులను,కార్యకర్తలను హింసించారు. కాబట్టి సగటు బీజేపీ కార్యకర్తల ఆవేదనను బండి సంజయ్ ప్రస్తావించారు.సంస్థాన్ నారాయణపురం మండలం పరిదిలో అనేక మంది కాంగ్రెస్ సహా వివిధ రాజకీయ పార్టీలలో హింసించ బడ్డ వారు నేటికీ ఉన్నారు.అలాంటి వారందరూ ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకొని రాజకీయాలు మాట్లాడాలి.గద్దర్ తుపాకి తోని రాజ్యాధికారం సాధించవచ్చు అని అమాయకులైన యువకులను విద్యకు దూరం చేసి తల్లిదండ్రులకు, సమాజానికి దూరం చేసి అడవులలో తిప్పుతూ ప్రజాస్వామ్యం పై పరోక్షంగా దాడి చేశాడు.అమాయక ప్రజలు పిల్లల చేతికి విప్లవ పాఠాలు నేర్పించి వాళ్ల చేతికి కలం బదులు గన్నులు పట్టేలా చేశాడు. తన కుటుంబ పిల్లలను ఉన్నత చదువులకై అమెరికా పంపించిన ఘనత గద్దర్ .నిజంగా గద్దర్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడకపోతే ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గద్దర్ శరీరంలో తుపాకీ గుండ్లు ఎందుకు దించింది.ఆనాడు ఏ ప్రభుత్వం అధికారం లో ఉంది అనే సమాధానం చెప్పాలి కాంగ్రెస్ పార్టీ.భారత భారత రాజ్యాంగాన్ని గౌరవించిన వ్యక్తి గద్దర్ ఐతే. తాను ఎన్నిసార్లు ఓటు హక్కును వినియోగించుకున్నాడు అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని మాట్లాడాలి.



## వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ

కాప్రా,వార్త మిర్రర్,జనవరి 29:మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ చేయడం గొప్ప విషయమన కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.అంజయ్య అన్నారు.గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమ న్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఆకలితో ఉన్నవారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.అనంతరం కుషాయిగూడ కు చెందిన పేద వృద్ధురాలు మాలేవరమ్మ,కొండూరి విజయ, అంబేద్కర్ నగర్ నివాసి పడకంటి రామచందర్ గుప్తాలకు ఈ నెల పించిని ముగ్గురికి వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త,ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త ,కార్యనిర్వాహక కార్యదర్శి,ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణి గుప్త,నంగునూరి అశోక్ గుప్త,తాటి శ్రీనివాస్ గుప్త,కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త,అమర కృష్ణ గుప్త,బల్లి శ్రీధర్ గుప్త,కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ గుప్త ఉప్పల ఆంజనేయులు గుప్త, రాయికంటి వేణుగుప్త, ఏనిశెట్టి రమేష్ గుప్త,సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్త,రాయికంటి ముత్యాలు గుప్తా,బస్సా శ్రీనివాస్ గుప్త,పెద్ది శ్రీనివాస్ గుప్త,కొకలా కృష్ణమూర్తి గుప్త,పెద్ది నవీన్ గుప్తా,రాజూరి జగదీష్ గుప్త,రాయల శ్రవణ్ గుప్తా,గెలివి ప్రసాద్ గుప్తా,విబివి కృష్ణ గుప్తా,కూరపాటి పవన్ కుమార్ గుప్తా,తోటం శెట్టి రామలింగయ్య గుప్త,రవ్వ ఈశ్వరరావు గుప్తా,కండె శివ గుప్త తదితరులు పాల్గొన్నారు.



## మందకృష్ణకి పద్మశ్రీ అవార్డు హర్షించదగిన విషయం

కల్వకుర్తి ఊర్కొండ వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు శ్రీ మాన్య శ్రీ మందకృష్ణ మాదిగకి జాతీయ పురస్కారం పద్మశ్రీ అవార్డు రావడానికి పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఆయనకి పాలాభిషేకం మరియు కేకు కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరై 30 సంవత్సరాల సుధీర్గ పోరాటం చేసి కుటుంబాన్ని పక్కనపెట్టి మాదిగల ఐక్యత కోసం ఏబిసిడి వర్గీకరణ సాధిస్తూ అదే విధంగా అణగారిన కులాల అందరి కోసం శ్రమించినటువంటి మహా నాయకుడికి కేంద్ర ప్రభుత్వ నరేంద్ర మోడీ గుర్తించి అయన సేవలకు ప్రతిఫలంగా పద్మశ్రీ అవార్డు ఇచ్చిసత్కరించినందుకు నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ అదేవిధంగా మందకృష్ణ మాదిగకి శుభాకాంక్షలు తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పంజుగుల గ్రామంలో మృతుడు కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం లోని పంజుగుల గ్రామానికి చెందిన పెరుమాళ్ళ ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది.మృతుడు ఆంజనేయులు గురించి దారమోని గణేష్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో లింగమ్మ కుటుంబానికి హలియమ్మ మరియు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ సైన్యం, బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్,ఇప్ప సాయిబాబు, సత్యం,కృష్ణయ్య,పాలేపు రాజేష్ ,నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## మాదిగ ఉపకులాల సదస్సు విజయవంతనికి కలిసికట్టుగా ముందుకు రావాలి

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ జనవరి 29.... మెట్టుగూడ డివిజన్ హమాలీబస్తీలో ఫిబ్రవరి 1వ తారీకు జరగాబోవు మాదిగ. మాదిగ ఉపాకుల సదస్సు ఫిబ్రవరి 7తేదిన లక్ష డప్పులు. వెయ్యి గొంతులు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొంజూరు విజయకుమార్ మాదిగ.డప్పు కళాకారులూ. ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జూనపల మహేష్, మాదిగ.విద్యార్థి విభాగం హైదరాబాద్ జిల్లా పల్లెరుల సుధాకర్ మాదిగ,హైదరాబాద్ జిల్లా నాయకులు వేణుగోపాల్ మాదిగ,దయల నర్సింగ్ రావు మాదిగ,మహిళ విభాగం సుజాత సూరారం,గస్కాంటి విజయకుమార్ మాదిగ, కందుల శ్రీనివాస్ మాదిగ, నవీన్ టైగర్.శివానంద్,శోభ, పల్లవి,క్షమిమ్ తదితరులు పాల్గొన్నారు.





# రాచకొండలోని జలాభిషేక రుద్రుడికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించిన రాచాప్ప సమితి

### 700 సంవత్సరాల క్రితం సింగభూపాలుడు పూజించిన శివలింగం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : రాచకొండలో ప్రాంతంలోని జలాభిషేక రుద్రుడికి మౌని అమావాస్య సందర్భంగా రాచప్ప సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభి షేకాలు నిర్వహించారు. రాచకొండలో 700 సంవత్సరాల క్రితం సింగభూపాలుడు పూజించి నటువంటి శివలింగానికి మహర్దశ రానున్నది. ఎన్ని సంవత్సరాలుగా కనబడని శివలింగం ఇప్పుడు పూజలు అందుకుంటున్నది నిత్యం జలంతో అభిషేకం చేసుకున్నటువంటి దిశలో ఈ శివలింగం నిర్మించబడింది. రాచకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపాన ఈ శివ లింగం ఉన్నది భక్తులు ఎవరైనా సరే ఈ శివలింగానికి చేరుకొని పూజలు చేసుకోను టకు అనువుగా ఉంటుంది. అద్భుతమైన ప్రదేశంలో ఈ శివలింగం నిర్మించబడ్డది రెండు గుట్ల మ ధ్యన జారు బండ వాటర్ ఫాల్స్ పక్కన ఈ శివలింగం ఉన్నది వచ్చే శివరాత్రికి వరకు భక్తు లకు అన్ని విధాల తీసుకురావడం కొరకు రచప్ప సమితి ప్రయత్నాలు చేస్తుంది. రాచకొండ శివరాత్రి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సరైన ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బద్దుల కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేశం, ప్రచార కార్యదర్శి బాల్యం పవన్ కుమార్, సభ్యులు వీడెం సాయికుమార్, ఏరా రమేష్ ఆలయ పూజారి లక్ష్మణాచార్యులు గౌతమ్ కుమార్ తదితరులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉండలేకపోతున్నాం

### ఎంపిడీఓ ఎదుట మొర పెట్టుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 29 : జగిత్యాల జిల్లా రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో ను కలిసి మేము గ్రామాల్లో ఉండలేక పోతున్నామని, తమను ఉపాధిహామీ కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో మమ్ములను ఎందుకు ఎంపిక చేయలేదని ఎక్కడ కనబడితే అక్కడ దూషిస్తున్నారని వినతిపత్రం అందజేశారు. మీకు ఇష్టమైన వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారని, మేము కూడా ఉపాధిహామీ కూలీకి వచ్చామని, ఎందుకు తమను ఎంపిక చేయలేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.... 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఉపాధిహామీ పథకంలో పని చేసి గుంట వ్యవసాయ భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులను గ్రామీణాభివృద్ధి శాఖ వెబ్సైట్ ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను, మేట్లను గ్రామాల్లో ఎవరైనా దూషించిన, ఇబ్బందులకు గురి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అర్హత కలిగిన లబ్ధిదారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షులు భూక్యా తిరుపతి, మహమ్మద్ నజీర్, కనికరపు లక్ష్మణ్, మామిడిపెల్లి మహేష్, మల్లేశం, శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, రవి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



### "ఉపాధి" ఉద్యోగులకు అందని జీతాలు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు గత మూడు నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలనెలా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెల ఉద్యోగుల ఎఫ్టివో జనరేట్ చేసి పంపుతున్న జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

# రేవంత్‌రెడ్డి విప్లవకారులను బీజేపీపైకి ఉసిగొలుపుతున్నాడు

### యాదాద్రి భువనగిరి జిల్లా బి. జే.వై.యం అధికార ప్రతినిధి ఎలిజాల శ్రీను

సంస్థాన్ నారాయణపూర్ జనవరి 29:(వార్తమిర్రర్) : నారాయణపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య బాటలో నడుస్తుంది.ఇటీవల పద్మశ్రీ అవార్డుల జాబితాలో గద్దర్ పేరు లేకపోవడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీని తప్పుపడుతూ విప్లవ భావజాలాలు కలిగిన వ్యక్తులను భారతీయ జనతా పార్టీ మీదికి ఉసిగొల్పే పనిలో భాగం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గద్దర్ తెలంగాణ ఉద్యమ కారుడు, కళాకారుడు, గద్దర్ కలంతో ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిన వ్యక్తి,కానీ తన ఆటా పాట తో విప్లవ భావాల తో యువకులను నక్సలిజం వైపు వెళ్లేలా చేశారు.తను విప్లవ భావజాలనికి కొమ్ముకాస్తూ అమాయకులైన ఏబీవీపీ, బిజెపి జాతీయభావాలు కలిగిన యువకులను హతమార్చుటకు మద్దతు పలికాడు.ఆనాటి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుండగొని మైసయ్య గౌడ్ ను తెరట్పల్లి గ్రామంలో , మంచాల మండలం తాళ్ళగూడెం గ్రామానికి చెందిన మహేందర్ గౌడ్ ను కాల్చి చంపారు.అనేక మంది బీజేపీ నాయకులను,కార్యకర్తలను హింసించారు. కాబట్టి సగటు బీజేపీ కార్యకర్తల ఆవేదనను బండి సంజయ్ ప్రస్తావించారు.సంస్థాన్ నారాయణపురం మండలం పరిధిలో అనేక మంది కాంగ్రెస్ సహా వివిధ రాజకీయ పార్టీలలో హింసించ బడ్డ వారు నేటికీ ఉన్నారు.అలాంటి వారందరూ ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకొని రాజకీయాలు మాట్లాడాలి. గతంలోని పాలకుల నిర్బంధాలకు , ఆధిపత్య వర్గాల జులుం కు గద్దర్ తుపాకి తోని రాజ్యాధికారం సాధించవచ్చు అని అమాయకులైన యువకులను విద్యకు దూరం చేసి తల్లిదండ్రులకు, సమాజానికి దూరం చేసి అడవులలో తిప్పుతూ ప్రజాస్వామ్యం పై పరోక్షంగా దాడి చేశాడు.

అమాయక ప్రజలు పిల్లల చేతికి విప్లవ పాఠాలు నేర్పించి వాళ్ల చేతికి కలం బదులు ఆయుధాలు పట్టేలా చేశాడు. తన కుటుంబ పిల్లలను ఉన్నత చదువులకై అమెరికా పంపించిన ఘనత గద్దర్ .నిజంగా గద్దర్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడకపోతే ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గద్దర్ శరీరంలో తుపాకీ గుండ్లు ఎందుకు దించింది.ఆనాడు ఏ ప్రభుత్వం అధికారం లో ఉంది అనే సమాధానం చెప్పాలి కాంగ్రెస్ పార్టీ.భారత భారత రాజ్యాంగాన్ని గౌరవించిన వ్యక్తి గద్దర్ ఐతే. తాను ఎన్నిసార్లు ఓటు హక్కును వినియోగించుకున్నాడు అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని మాట్లాడాలి.





### విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 29 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో బుధవారం రోజున విశ్వబ్రాహ్మణ సంఘము లో సభ్యులందరు కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చందనగిరి రమేష్, వైస్ ప్రెసిడెంట్ గాలిపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా ఎదురు గట్ల రవీందర్, గౌరవసలహాదారులుగా కొడిమ్యాల లింగమూర్తి, మండలోజి శ్రీనివాస్, కొడిమ్యాల శంకరయ్య, చందనగిరి మనోహర్, కొడుమ్యాల శంకర్, శ్రీపాద లక్ష్మీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల కోసం నావంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండాలని, నన్ను ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, యువకులు, సీనియర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



### ఆర్థిక సహాయం అందజేసిన కాలిని యువత

సంస్థాన్ నారాయణపూర్ జనవరి 29:( వార్త మిర్రర్) నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సోమన బోయిన అశోక్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదం గురై మరణించారు.ఈ సందర్భంగా కాలనీకి చెందిన యువకులంతా కలిసి బుధవారం 24500/బి రూపాయలు అశోక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సోమనబోయిన కృష్ణ కుమార్ యాదవ్, ఐలయ్య యాదవ్, శివ శంకర్, చంద్రశేఖర్, మహేష్, నిరంజన్, బండి సుధాకర్, లింగస్వామి, గంటిల లింగస్వామి, శరత్, గూదే మల్లేష్, అందె నరేష్, శంకర్ బాబు, అందె రమేష్, బచ్చునిగొని సుజిత్, గంటీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

పీ. ఏ.పల్లి జనవరి 29 వార్త మిర్రర్: పీఏపల్లి మండలం అంగడిపేట ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గత రెండు సంవత్సరాలుగా ఎంతోమంది క్రీడాకారులను తయారుచేస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కబడ్డీ క్లబ్ నందు శిక్షణ పొందుతున్న దాదాపు 26 మంది క్రీడాకారులకు కబడ్డీ కిట్టును గణపురం మాజీ సర్పంచ్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పావని పరమేష్ యాదవ్ అందించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారూలు సుధాకర్ రెడ్డి గారు, మైనం లింగయ్య, నిమ్మల సత్యనారాయణ, క్లబ్ కోచ్ పగిడిమర్రి రవి, క్లబ్ అధ్యక్షులు బొడ్డుపల్లి కళాచారి, కార్యదర్శి మదారూ గణేష్, క్లబ్బు కోశాధికారి తాళ్ల మహేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చితిరియాల అరవింద్,మాదరి గిరిధర్ హరీష్ రెడ్డి, అంజి బాబు, తదితరులు పాల్గొన్నారు.



### హలో మాదిగ చలో హైదరాబాద్: ఏబిసిడి వర్గీకరణకై కలిసి నడుద్దాం

పీ. ఏ.పల్లి జనవరి 29 వార్త మిర్రర్ : ఫిబ్రవరి 7వ తారీకు రోజున ఏబిసిడి వర్గీకరణకై ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో జరిగే వెయ్యి గొంతులు లక్ష డబ్బుల భారీ బహిరంగ ప్రదర్శనకు పెద్ద ఎత్తున కదలి రావాలని పెద్ద అడి చర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద దళిత సంఘం నాయకులు ఆడెపుసతీష్ ,మద్దిమడుగు సాయి, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ,మాదిగ ప్రజలు వేలాదిగా గ్రామాలనుంచి తరలి వెళ్లాలని 30 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో 2000 సంవత్సరంలో ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ అమలై 2024 వరకు మాదిగ మాదిగ ఉపకులాలను రిజర్వేషన్ ఫలాలు అందినాయి తదనంతరం సుప్రీంకోర్టు రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం లేదని చెప్పడంతో ఎస్సి ఏబిసిడి వర్గీకరణ ఆగిపోవడం జరిగింది 2024 ఆగస్టు ఒకటిన ఏడుగురు జడ్జిల్లా సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైన డిమాండ్ అని దానిని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని అనుకూలంగా తీర్పు ఇవ్వడంతోటీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు దేశంలోని మొట్టమొదటిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తారని హామీ ఇవ్వ డం జరిగిందని, గతంలో ఉద్యోగం నోటిఫికేషన్లు వేసినప్పటికీ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ అమలుపరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చేయాలని ఫిబ్రవరి 7న లక్ష డబ్బుల వేల గొంతుకుల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని, పిలుపునిచ్చారు. దేవరకొండ నియోజ కవర్గం నుండి మాదిగ మాదిగ ఉపకులాలు వేలాదిగా కదలి రావాలని దళిత సంఘం నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వసుకుల కృష్ణయ్య మారుపాక గోపాల్ మద్దిమడుగు ముత్తయ్య బాష్పాక పవన్ ఎర్ర యాదగిరి ధర్మపుర శ్రీనివాస్ మహేందర్ పోతం కర్ణయ్య ఆర్వీటి అచ్యుత్ రవి గిరి దున్న ముత్యాలు గండు సుధాకర్ పెద్దలు రాజేష్ రవి సైదుల్ నెల్సన్ జానయ్య రామస్వామి విజయ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్

### డాక్టర్ అజయ్ కుమార్ (టీవివిపి) కమిషనర్





దేవరకొండ జనవరి 29 వార్త మిర్రర్ : తెలంగాణ వైద్య విద్యా పరిషత్ (టివివిపి) కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ దేవరకొండ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను డి సి హెచ్ ఎస్ మాతృనాయక్ ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన అన్నారు. అలాగే వైద్యులు సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను చూడాలని తెలిపారు. అనంతరం అన్ని వార్డులను తిరిగి ఆసుపత్రిలో కావలసిన సదుపాయాల గురించి ఆరా తీశారు. సమాచారము ఇవ్వని సూపరిండెంట్:-దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఏ అధికారి జిల్లా కలెక్టర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ హెల్త్ సెక్రెటరీ గాని, ఎవరు వచ్చినా గాని ఆసుపత్రి సిబ్బంది మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు? ఎందుకంటే ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఎక్కడ బయట పెడతారన్న భయంతో మీడియాకు సమాచారం ఇవ్వడం లేదు. బుధవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ వచ్చిన విషయం సూపర్డెంట్ రవి ప్రకాష్ ని చరవాణిలో వివరణ కోరగా మీకు చెప్పాలన్న అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఇప్పటికైనా ఆసుపత్రిలో ఏ సమావేశం జరిగిన మీడియాకు సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వైయస్ కరుణాకర్ కోరారు. కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ మాతృనాయక్, సూపరిండెంట్ రవి ప్రకాష్, డాక్టర్ భాను ప్రసాద్, డాక్టర్ మంగ్త నాయక్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# మలక్‌పేట యశోద హాస్పిటల్‌లో అరుదైన వ్యాధికి చికిత్స

## ఆకలాసియా కార్డియా (నోటి ద్వారా ఆహారం తీసుకోలేకపోవడం) చికిత్స

## ఎండోస్కోపీ విధానంలో 24 గంటల్లో వైద్యం చేసిన డాక్టర్ కిషన్ నున్సవత్





దేవరకొండ జనవరి 29 వార్త మిర్రర్ : హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ లో అకలాసియా కార్డియా అనే అరుదైన జబ్బుకు డాక్టర్ నూన్సవత్ కిషన్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎన్టిరాలజి స్ట్ ఆధ్వర్యంలో ఎండోస్కోపీ చికిత్స ద్వారా అరుదైన వ్యాధికి చికిత్స అందించి వ్యక్తి ప్రాణాలను కాపాడిన యశోద హాస్పిటల్ డాక్టర్. దేవరకొండ పట్టణంలో స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ కిషన్ నూన్నావత్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ వారు ఈ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చారకొండ మండలం శిరసనగండ్ల గ్రామానికి చెందిన తిప్పర్తి రంగారెడ్డి ఆకలాసియా కార్డియా (నోటి ద్వారా ఆహారాన్ని తీసుకోలేకపోవడం) అనే వ్యాధితో గత సంవత్సర కాలంగా బాధపడుతున్నారని ఏ హాస్పిటల్ లో చేయించిన ఫలితం లేకపోవడంతో తిప్పర్తి రంగారెడ్డి(44) సమీప బంధువుల ద్వారా మలక్ పేట యశోద హాస్పిటల్ వారిని ఆశ్రయించగా వారు బాధపడుతున్న వారు ఎండోస్కోపీ చికిత్స ద్వారా 24 గంటల్లో నోటి ద్వారా ఆహారం తీసుకున్న విధంగా యశోద వైద్య బృందం చికిత్స చేశారని డాక్టర్ తెలిపారు. ఈ వ్యాధి పదివేల మందిలో ఒక్కరికి వచ్చే అవకాశం ఉంటుందని ఆరుదైన వ్యాధి మెల్ల మెల్లగా తీవ్రమైతుందని వ్యాధి ఎక్కువ ఆహారం అందక వ్యాధి చూసిన వారు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని వారు తెలిపారు. దీనికి ఎటువంటి ఆపరేషన్ లేకుండా ఎండోస్కోపీ విధానంతో శాస్త్ర చికిత్స ఒకటే మార్గం అని ఇటువంటి వైద్యాన్ని అందించి వ్యక్తి ప్రాణాలను కాపాడే ఘనత ఒక యశోద హాస్పిటల్ వారికి చెందుతుందని వారు అన్నారు. యశోద హాస్పిటల్ లో అత్యంత అధునాతన సౌకర్యాలు సాంకేతిక వైద్య పరిజ్ఞానం చికిత్స పద్ధతులతో కూడిన గ్యాస్ట్రోఎంటరాలజీ చికిత్స అందుబాటులో ఉంటుందని అత్యంత క్లిష్టమైన వ్యాధులకు కూడా యశోద ఆసుపత్రిలో వైద్య బృందం చక్కటి చికిత్స అందిస్తుందని వారు తెలియజేశారు. ఈ అవకాశాన్ని దేవరకొండ నియోజకవర్గం ప్రజలు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో వారితో పాటు ఆస్పత్రి జిఎం వాసు కిరణ్ వినయ్ వెంకటేష్ జితేందర్ రాజశేఖర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## రబీ పంట సీజన్ లో యూరియాకు కొలత లేదు, రైతులు ఎమ్మార్పీ ధరకు యూరియా కొనాలి

మిర్యాలగూడ జనవరి 29:-( వార్తమిర్రర్) : మిర్యాలగూడ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, నల్లగొండ జిల్లా నాగార్జున సహకార మార్కెటింగ్ సొసైటీ కేంద్రాలను సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించారు. గోదాములలో యూరియా నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంట సీజన్ కు మండలంలో యూరియా కొరత లేదని రైతులు యూరియా గురించి ఇబ్బంది పడకుండా దగ్గర్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా విరివిగా అందుబాటులో ఉందని సూచించారు. ప్రైవేటు దుకాణదారులు యూరియాను ఎమ్మార్పీ రూ.266ల కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





## అంగన్వాడి కేంద్రాలను పరిశీలించిన అధికారి మిర్యాలగూడ

జనవరి 29:-( వార్త మిర్రర్): సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడి కేంద్రం భవనం పెచ్చులు ఊడి పడి పోయిన ఘటన అనంతరం సమగ్ర మహిళా,శిశు సంక్షేమ శాఖ అప్రమత్తమై మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలలో భవనాలు పరిశీలించాలని ఆదేశించడంతో స్థానిక అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలోని హాట్యాతండా, బండా పరుపు తండా, రుద్రారం గ్రామపంచాయతీల్లోని అంగన్వాడి కేంద్రాల భవనాలను గోడలు, కప్పులను పరిశీలించారు. అదేవిధంగా కేంద్రాలలో పిల్లలకు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్, ఆయాలు ఉన్నారు.

## ఐటీ షేర్ల మద్దతుతో..

### లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 632, నిఫ్టీ 206 పాయింట్లు వృద్ధి



ముంబై, జనవరి 29: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 631.55 పాయింట్లు లేదా 0.83 శాతం పెరిగి 76వేల మార్కును దాటి 76,532.96 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 698.32 పాయింట్లు పుంజుకున్నది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 205.85 పాయింట్లు లేదా 0.90 శాతం ఎగిసి 23వేల స్థాయికి ఎగువన 23,163.10 వద్ద నిలిచింది.

#### మెరిసిన ఐటీ, రియల్టీ షేర్లు

ఐటీ, రియల్టీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 3.10 శాతం పెరిగింది. ఇండస్ట్రియల్స్ 2.94 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.70 శాతం ఐటీ 2.65 శాతం, కమోడిటీస్ 2.30 శాతం, హెల్త్‌కేర్ 2.20 శాతం చొప్పున పెరిగాయి. ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు మాత్రం నష్టపోయాయి. జొమాటో షేర్ విలువ గరిష్ఠంగా 7 శాతం ఎగబాకింది. టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లూ లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ 3.28 శాతం పెరిగాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభాల్లో ముగిశాయి.

#### నిరాశపర్చిన ఐటీసీ హెూటల్స్

ఐటీసీ హెూటల్స్ లిమిటెడ్ షేర్లు నిరాశపర్చాయి. మాతృ సంస్థతో విడిపోయి స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి బుధవారమే ప్రవేశించిన ఈ సంస్థ షేర్లు.. తొలిరోజే 5 శాతం వరకు నష్టాలను చవిచూశాయి. రూ.188 వద్ద లిస్టింగ్ అవగా, బీఎస్ఈలో రూ.178.60 వద్ద, ఎన్ఎస్ఈలో రూ.171.85 వద్ద నిలిచాయి.



## ప్రమాదవాశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మారణం



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 29 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దం నవీన్ రెడ్డి(27) అనే యువకుడు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే నవీన్ రెడ్డి తన కెజివిల్ ట్రాక్టర్ ను తీసుకెల్లి రామాజీపేట, కుమ్మరిపెల్లి గ్రామాల మధ్య గల తన స్వంత వ్యవసాయ భూమిలో వరి నాట్ల కోసం దుక్కిదున్నుతుండగా, ట్రాక్టర్ బురదలో దిగబడింది. ట్రాక్టర్ నుండి కెజివిల్ తొలగించే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి నవీన్ మీద పడింది. దాంతో బురదలో కూరుకుపోయి నవీన్ ఊపిరాడక సంఘటన స్థలంలోనే మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నవీన్ కు భార్య, ఐదేళ్ల లోపు కుమారుడు, కూతురు ఉన్నారు. నవీన్ తండ్రి ఇటీవలనే మృతి చెందడంతో నవీన్ ఇంటికి పెద్ద దిక్కుగా ఉండగా,అతని మృతితో ఆ కుటుంబం కన్నీరు మున్నీరౌతున్నారు. రామాజీపే టలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ ను సత్కరించిన ఎరుకల అశోక్

దేవరకొండ జనవరి 29 వార్త మిర్రర్ : దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ ఇటీవల పదవీకాలం ముగియడంతో వారిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన తాటి కోల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎరుకల అశోక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ పట్టణాభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ సేవలు మరువలేనివని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్మన్ గా ఆలంపల్లి నరసింహ దేవరకొండ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వారి పాలనలో దేవరకొండ పట్టణం మరింత అభివృద్ధి చెందడంలో ఆయన అహర్నిశలు కృషి చేశారని వారు తెలిపారు. అంతేకాకుండా దేవరకొండ కు తలమానికం అయిన ఖిల్లా దుర్గం లో విశాలవంతమైన పార్కును ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని వారు తెలిపారు. రానున్న రోజులలో వారికి మరింత ఉన్నత పదవులు స్వీకరించలని ఆయన కోరారు.



## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ఆర్థిక సహాయం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 29 : రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం, లింగారెడ్డి గూడెం,గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పురుముత్తయ్య, 5000 రూపాయలు, సుర్కంటి కేశవరెడ్డి 10వేల రూపాయలు, పిల్ల మారయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి కుటుంబానికి 15వేల రూపాయలు నగదుగా ట్రస్టు కార్యదర్శి ఎంఏ ఖయ్యూం, ట్రస్టు సభ్యులు నల్ల నర్సింహ అందజేశారు. అనంతరం ట్రస్ట్ కార్యదర్శి ఎంఏ ఖయ్యూం మాట్లాడుతూ,నిరుపేద కుటుంబమునకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలకు రాజీవ్ ట్రస్టు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొరగోని లింగస్వామి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుర్కంటి వెంకటరెడ్డి, ఉదరి యాదయ్య,మాజీ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ బోదుల శంకరయ్య,ఆరుట్ల యాదయ్య,మాజీ సర్పంచ్ ఊదరి నరసింహ, ఎర్రగోని లింగస్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు బండమీది ఎల్లయ్య, బండమీది వెంకటేశం, కల్లెం దయాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఫోటోగ్రాఫర్స్ జిల్లా కార్యవర్గానికి ఘనంగా సన్మానం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 29 : చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ లో బుధవారం చౌటుప్పల్ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఫోటోగ్రాఫర్ సంక్షేమానికి నూతనంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎర్రోజు యజ్ఞామాచారి, జిల్లా సహాయ కార్యదర్శిగా గంగాపురం కాటంరాజు గౌడ్, సలహాదారుడుగా విశ్వనాథ్ చంద్రశేఖర్ లు నియామకం కావడంతో ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు తంబరేణి రవీందర్, మండల అధ్యక్షుడు తొర్పునూరి సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుక్క స్వామి, కోశాధికారి వనం బుషి, ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.



## ఎస్సి వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ జనవరి 29:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ ఎన్ఎస్పి క్యాంపులోని తెలంగాణ స్టేట్ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన డైరీ క్యాలెండర్ల ఆవిష్కరణకు ముందు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ డా,బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్యాలెండర్, డైరీ ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం రాజ్యాంగ రచించిన బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో నడుస్తూ ప్రతీ పేద వాడికి సంక్షేమం అందించే దిశగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.